క్లుప్తంగా

కాల్వలో మొసలి ప్రత్యక్షం



చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామ శివారులోని కాచిగూడ కాలనీ వెనకాల ఉన్న కాల్వలో శుక్రవారం మొసలి ప్రత్యక్షమైంది. స్థానికుల కథనం ప్రకారం.. కాచిగూడ కాలనీ వెనకాల ఉన్న బొక్కల మాటు కాల్వలో మొసలి కనిపించగా స్థానిక యువకులు కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అధికారులకు సమాచారం అందిద్దాం అనుకునేలోపే మొసలి తిరిగి కనిపించకుండా నీటిలోకి వెళ్లి పోయింది. దీంతో కాచిగూడ కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటువైపు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ)గా బాధ్యతలు స్వీకరించిన హైమావతి తొలిసారిగా నర్సంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుకు వచ్చిన సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది శుక్రవారం పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. తొలుత హైమావతికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విద్య, శ్రీదేవి, తదిరతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల పరిధిలోని గ్రామాలకు నేటి (శనివారం) ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని నర్సంపేట డీఈ శ్రీధర్ పేర్కొన్నారు.

మండలంలో..

నెక్కొండ : నేడు (శనివారం) మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ ఆర్.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న క్రమంలో 33/11 కేవీ పత్తిపాక, రెడ్లవాడ, అలంకానిపేట పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన చిరుత నాగరాజు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, నాయకుడు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత నాగరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపాక శ్రీనివాస్, ఎర్పుల శ్రీనివాస్, కరిమిళ్ల దుర్గారావు, ఏకాంతం, బొట్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన మంద చంద్రమౌళి తండ్రి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లం బాలకిషోర్ రెడ్డి శుక్రవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత బాధితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, చాపర్తి కనుకయ్య ,గడుదుల బొంద్యాలు, మర్రి కోటిలింగం, తోట కమలాకర్, ఎంబాడి మహేందర్, పెర్ల రాజ్‌కుమార్, పెర్ల రవి, పెర్ల ఐలయ్య, పెర్ల సాంబయ్య, బక్క రాములు సాంబయ్య, మంద చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హనుమకొండకు చెందిన అజర కార్పొరేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు డయాబెటిస్, గుండె సంబంధిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

సన్మార్గమే దైవభక్తికి నిదర్శనం

చెన్నారావుపేట : సన్మార్గంలో పయనించడమే దైవ భక్తికి నిజమైన నిదర్శనమని హైదరాబాద్‌కు చెందిన అగ్ర పీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోనీ స్పష్టం చేశారు. మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో విచారణ గురువు తుమ్మ యాగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన శతవత్సర గ్రామ ఆవిర్భావ జూబ్లీ వేడుకలు శుక్రవారం ముగిశాయి. తొలుత సమిష్టి దివ్య బలి పూజ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి పూల ఆంథోనీ మాట్లాడారు. ప్రజలు దేవుడి బాటలో నడుచుకోవాలని చెప్పారు. ప్రభువు వందేళ్లుగా గ్రామస్తులను ఆశీర్వదిస్తున్నాడని చెప్పారు.



ప్రసంగిస్తున్న పీఠాధిపతి పూల అంథోని

అన్ని కుటుంబాలను ఉన్నతంగా ఉంచాడన్నారు. ప్రజలు సుభిక్షంగా జీవించాలని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా చర్చి ఎదుట



వేడుకలో పాల్గొన్న భక్తులు

ఏర్పాటు చేసిన రక్షణ పతాక స్తూపాన్ని ఆవిష్కరించారు. గుడి పెద్దలు పీఠాధిపతులను, గ్రామంలో పరిచర్య చేసిన గురువులను సన్మానించారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



రైతులతో మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం : వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిసిందని చెప్పారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించినా పలు చోట్ల కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే తరుగు తీయకుండా కొనుగోలు చేయడంతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, చంద్రమౌళి, వీరయ్య, వెంకన్న, దేవేందర్‌రెడ్డి, కొమ్మాలు, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో యువతకు అన్యాయం



నర్సంపేట : మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి



ఖానాపురం : మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

నర్సంపేట : మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ పేరుతో ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట్‌నారాయణగౌడ్ ఆరోపించారు. పట్టణంలోని 24 వార్డుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లతో పట్టణ ఇన్‌చార్జ్ గోనె యువరాజు, రాయిడి దుశ్యంత్‌రెడ్డి సంయుక్త అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రవీందర్‌రెడ్డి, వెంకట్ నారాయణ మాట్లాడారు. అధికారంలోకి వస్తే రూ.4 వేల నిరుద్యోగ భృతి చెల్లించడంతోపాటు 50 వేల ఉద్యోగ ఖాళీలతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి 5 నెలలు గడచినా ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీర్మార్ మల్లన్న ఊదరగొట్టిన మేరకు ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీని ఒక్కసారైనా ప్రశ్నించారా అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకుడు కావాలో ప్రభుత్వాన్ని ప్రశంసించే నేత కావాలో ఆలోచించుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ ప్రసాద్, దేవోజు తిరుమల సదానందం, పాషా, రజిత చంద్రమౌళి, పట్టణ ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్, క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

ఖానాపురం : పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి బీఆర్‌ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ క్రమసంఖ్యలోని మూడో నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మోసపూరిత హామీలతో ప్రజలను వంచిస్తోందని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ మస్తాన్, నాయకులు వడ్డె రాజశేఖర్, దాసరి రమేశ్, ప్రవీణ్‌కుమార్, రాధారపు అశోక్, వెన్ను పూర్ణచందర్, దేవేందర్, బంధారపు శ్రీనివాస్, సుమన్ పాల్గొన్నారు.

మండలంలో 2965 'ఎమ్మెల్సీ' ఓట్లు

గీసుకొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల కోసం మండలంలో 2 వేల 965 మంది ఓట్లు ఉన్నాయని తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోసం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీఎస్ 133వ నంబర్ పోలింగ్‌స్టేషన్ పరిధిలో 455 మంది పురుష, 284 మంది మహిళ ఓటర్లు ఉన్నారని తెలిపారు. అదే పాఠశాలలో 134వ నంబర్ పోలింగ్‌స్టేషన్ పరిధిలో 470 మంది పురుష, 271 మంది మహిళ ఓటర్లున్నట్లు చెప్పారు. అలాగే జెడ్పీ హైస్కూల్‌లోని 131వ నంబర్ పోలింగ్‌స్టేషన్ పరిధిలో 434 మంది పురుష, 305 మంది మహిళ ఓటర్లు, 132వ నంబర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 469 మంది పురుష, 277 మంది మహిళ ఓటర్లున్నట్లు వివరించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్ (ప్రభుత్వ జూనియర్ కళాశాలలో) ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని వివరించారు. మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేజీబీవీలో..

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ బుర్ర కవిత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియం కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

పర్వతగిరి : మండలంలోని పలు చెరువుల నుంచి నల్ల రాగడి మట్టిని కొందరు ఇటుక బట్టీల యజమానులు వారం రోజులుగా అక్రమంగా తరలిస్తున్నారని రైతు సంఘం నాయకులు గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, అశోక్ తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్, శ్రీనివాస్, అశోక్ మాట్లాడారు. నల్ల రాగడి మట్టి తీయడంతో చెరువుల కింద ఉన్న బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. రాగడి మట్టి తరలించొద్దని కోరుతూ ఇటీవల అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

నర్సంపేట : ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. మాదన్నపేట రోడ్డులో నివాసం ఉండే బొల్లం నర్సయ్య (75) భార్య ఆరు నెలల క్రితం మృతి చెందింది. నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నర్సయ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాట్రపల్లిలో..

సంగెం : ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కాట్రపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్క ఎల్లయ్య (73) చేపలు పట్టి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. శుక్రవారం కుటుంబీకులు ఖిలా వరంగల్‌లో బంధువు సంవత్సరీకానికి వెళ్లిన సమయంలో రేకుల షెడ్ ఇనుప పైపునకు ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంచినీళ్లు తాగేందుకు ఇంట్లోకి వచ్చిన ఎల్లయ్య మనుమడు మహీధర్ గమనించి పక్కింట్లో ఉంటే నీలం రాజుకు తెలపగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి పెద్ద కూతురు చీరబోయిన రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎల్.నరేశ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.



ఎల్లయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేశ్

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



అంజిగౌడ్‌ను పరామర్శిస్తున్న రమేశ్, నాయకులు

చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు మండల అంజిగౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సయమంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడిపోయాడు. ఈ ప్రమదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు గమనించి అంజిగౌడ్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండల అంజిగౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ కోరారు. అంజిగౌడ్‌ను వరంగల్‌లోని ఆస్పత్రిలో రమేశ్ ఆధ్వర్యంలోని బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయాల పాలైన, మృతి చెందిన గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, నాయకులు కాసాని రమేశ్, బాబు, ప్రశాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ మాత జయంతి

వరంగల్: ఆర్యవైశ్యుల కులదైవం, లోకమాత విశ్వజనని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వాసవి మాత 1008వ జయంతిని పురస్కరించుకుని ములుగు రోడ్డు సమీపంలోని వాసవి మాత దేవాలయంలో జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు తెలిపారు. దేవాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 6గంటల నుంచి పూజా కార్యక్రమాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాసవి మాత దర్శన్ పెనుగొండకు వెళ్లి వచ్చిన సుమారు 1500 మంది వాసవి మాత భక్తులకు వాసవి రత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోనుపునూరి వీరన్న, వాసవి మాత దర్శన్ ప్రోగ్రాం కన్వీనర్లు మల్యాల వీరమల్లయ్య, అంచురి శ్రీనివాస్, వాసవి మాత దేవాలయం చైర్మన్ తాటికొండ సత్యనారాయణ, అడ్డగుడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి



శోభన్ (ఫైల్)

చెన్నారావుపేట : అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కల్ చెడ గ్రామ శివారులోని కట్టయ్యపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కట్టయ్యపల్లెకు చెందిన దుడ్డె శోభన్ (49) ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శోభన్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు, ఆటోడ్రైవర్లు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

గంగారం : మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంట నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొక్కజొన్న, కూరగాయల పంటలు, మామిడి తోటలు పెద్ద ఎత్తున వర్షాలతో దెబ్బతిన్నాయని, వారికి ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం అందించాలని కోరారు. వర్షాకాలంలో సీజన్‌లో రైతాగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడిగా కురుసం రంగయ్య, ఉపాధ్యక్షులుగా జజ్జర వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా సువర్ణపాక నాగేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా గుంట రామరావు, కోశాధికారిగా జోగ వెంకటయ్య, కార్యవర్గ సభ్యులుగా పులుసు నాగేశ్వర్‌రావు, జజ్జన సమ్మయ్య, బర్ల వెంకన్న, తాటి సమ్మయ్య, తదితరులు ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆరాధనోత్సవాలు విజయవంతం చేయండి

ఖిలా వరంగల్: ఈనెల 18న వరంగల్ భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరగనున్న ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయాలని భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపకుడు ఆచార్య రాచమల్ల పున్నమాచార్యులు, కాలజ్ఞాన ప్రచార భారతి తెలుగు విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండోజు వీరాచారి, ప్రధాన కార్యదర్శి రాచమల్ల శంకరాచార్యులు కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆరాధనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచశాంతి కోసం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపకుడు ఆచార్య రాచమల్ల పున్నమాచార్యుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరాధన ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పొన్నగంటి రవీంద్రచారి, వెలిషోజు తిరుమలచారి, కంచర్ల సదానందం, మడిపోజు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పున్నమాచార్యులు, తదితరులు

విద్యుత్ స్తంభం పైనుంచి పడి యువకుడికి గాయాలు

గూడూరు: విద్యుత్ స్తంభం నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మట్టివాడలో శుక్రవారం జరిగింది. మట్టివాడకు చెందిన గుండెబోయిన హరీశ్ గ్రామ విద్యుత్ హెల్పర్, లైన్‌మెన్ చెప్పిన విద్యుత్ మరమ్మతుల పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో స్తంభం ఎక్కిన హరీశ్ ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన విద్యుత్ సిబ్బంది వెంటనే మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడ నుంచి గార్డియన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ ప్రణీత్ తెలిపారు.

విద్యుదాఘాతంలో ఎద్దు మృతి

గూడూరు: తెగిపడి ఉన్న విద్యుత్‌వైర్‌కు పాడిగేదె తాకి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని మధనాపురంలో శుక్రవారం జరిగింది. రైతు లింగాల సుధీర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాత్రి వీచిన గాలికి శ్మశానవాటిక దగ్గర విద్యుత్ వైర్ తెగింది. ఉదయాన్నే మేతకు వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్‌తో మృతి చెందాయి.

నేడు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీరుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చేయూత

ఖిలా వరంగల్: వరంగల్ తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎండీ.అబ్దుల్ రవూఫ్(32) శంభునిపేట ప్రధాన రహదారిపై బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని నగర బైక్ మెకానిక్‌లతో కలిసి ఆల్ టూవీలర్ మెకానిక్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు రూ.60వేలు అందజేశారు. బాధితులకు మెకానిక్ అసోసియేషన్ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్‌లు ఫిరోజ్ అక్బర్, సలీం, ఇంతియాజ్ రాజు, అజయ్, అంజూమ్ వాహేద్ అలీ, రాము, సందీప్, సోని పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట: జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు (12616) కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేట - వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య మెడికేర్ హాస్పిటల్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు 35 - 40 సంవత్సరాల మధ్య వయస్సు మృతుడి ఎడమ చేతిపై రాజమ్మ (ఇంగ్లిష్‌లో), కుడి చేతి తెలుగులో అమ్మ అని, ఇంగ్లిస్‌లో కల్యాణి అని పచ్చ బొట్టు ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఐలయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. వివరాలకు 99594 25483, 8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి



కొత్తగూడ : నకిలీ విత్తనాలను అరికట్టాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎరువుల షాపులు రైతులకు ఉపయోగం పడటంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు విజయ్, లచ్చయ్య, సుకెందర్ పాల్గొన్నారు.